క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పాఠశాల విద్యార్థులకు ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఏకల్ అభియాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పెన్నులు, చార్ట్స్‌తో పాటు వివిధ స్టడీ మెటీరియల్‌ను 30 మంది విద్యార్థులకు అందించారు. ఫౌండేషన్ సభ్యుడు దీపక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ అందించడంలో భాగంగా నోట్‌బుక్స్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, సృజన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో డీజే నిషేధం

ఇచ్చోడ: గణేశ్ ఉత్సవాల్లో డీజే, కలర్‌పేపర్స్, లేజర్ లైట్లపై నిషేధం ఉందని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ మండలాల పరిధిలో నిషేధించినట్లు తెలిపారు. నియమాలను ఉల్లంఘించిన వారిపై చటరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

జైనథ్ : వర్షాకాలంలో ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సీహెచ్‌వో అంజయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మండల కేంద్రంలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగామణి, గంగాదేవి, ఆశ వర్కర్లు లక్ష్మి, స్రవంతి, పంచాయతీ కార్యదర్శి ముజీబ్‌ఖాన్ పాల్గొన్నారు.


బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



సుహాసిని రెడ్డిని హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్: కాంగ్రెస్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల నిరసనల దృష్ట్యా జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డిని ఆదివారం పోలీసులు ఆమె నివాసంలో ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నిరసన తెలిపేందుకు అవకాశం లేకుండా చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయ దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అరెస్ట్ అయిన వారిలో సీనియర్ నాయకులు గందే విజయ్ కుమార్, అల్లూరి నారాయణరెడ్డి, కాంత, సతీష్ ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న నాయకులు

భీంపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గుబిడి, టేకిడిరాంపూర్ సమీపంలోని వంతెన వద్ద కోతకు గురై రాకపోకలు ఇబ్బందిగా మారింది. దీంతో యువ నాయకుడు కపిల్ యాదవ్ తన సొంత ఖర్చులతో ఆదివారం గుంతను పూడ్చారు. రోడ్డు మార్గాన్ని బాగు చేయగా స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రెడ్డి రమేశ్, మాజీ సర్పంచ్ గంగారాం, మేకల ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆదిలాబాద్‌టౌన్: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం చేపడుతున్న ధర్నాకు తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) సభ్యులు హాజరు కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోగల సుదర్శన్, సురేందర్ రెడ్డిలు ప్రకటనలో కోరారు. ఉదయం 11 గంటలకు టీఎన్‌జీఓ భవనానికి రావాలని, అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు.

జోరుగా ‘బెల్ట్’ దందా..!



ఇచ్చోడలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్

- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- అధిక ధరలకు విక్రయిస్తున్న వైనం
- కన్నెత్తి చూడని అధికారులు

ఇచ్చోడ: నియోజకవర్గ వ్యాప్తంగా బెల్ట్‌షాప్‌ల దందా జోరుగా సాగుతోంది. వైన్స్‌లో తక్కువ ధరకు కొని బెల్ట్‌షాపుల ద్వారా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారు,. గ్రామాల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుంది. అధిక ధరలకు మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబు జేబులకు చిల్లులు పడుతున్నాయి. బెల్ట్ షాపులలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న సంబంధిత అబ్కారీశాఖ కనీసం పట్టించుకోవడం లేదు.

అదనంగా రూ. 20..

బెల్ట్‌షాపుల్లో ప్రతీ క్వార్టర్‌పై అదనంగా రూ. 20 తీసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో , అత్యవసరంగా మందును కొనుగోలు చేసే వారు అడిగినంత ఇస్తున్నారు. దీంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. రూ. 340 ఉన్న బ్లెండర్ స్ప్రైడ్ క్వాటర్‌ను బెల్ట్‌షాపుల్లో రూ. 360కి విక్రయిస్తున్నారు. రూ. 180 ఉన్న లైట్ బీరును రూ. 200లకు అమ్ముతున్నారు. చీఫ్ లిక్కరు నుంచి బ్రాండెడ్ మద్యం వరకు ప్రతి క్వార్టర్‌పై రూ. 20 నుంచి రూ. 50 అధికంగా వసూలు చేస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్ట్‌షాప్‌లు..

నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది బెల్ట్‌షాప్‌లు నడుస్తున్నాయి. మారుమూల గ్రామాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం వందలాది బెల్ట్‌షాప్‌లు ఉన్నాయి. ఒక్క ఇచ్చోడ మండల కేంద్రంలోనే దాదాపుగా 60 బెల్ట్‌షాప్‌లు నడుస్తున్నాయి. బడులు, గుడులు, పబ్లిక్ స్థలాలు ఇలా నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ దందా చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, మహిళలు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

24 గంటలు అందుబాటులో..

గ్రామాలే కాకుండా మండల కేంద్రాల్లో సైతం 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉంటుంది. కొంత మంది బెల్ట్‌షాప్‌ల వారు అర్ధరాత్రి 2 గంటలకు కూడా విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబులు ఎప్పుడు పడితే అప్పుడు మద్యం కొనుగోలు చేస్తూ.. వివాదాలకు, ఘర్షణలకు కారణం అవుతున్నారు. బీర్ల నుంచి మొదలు కొని ఖరీదైన మద్యం కూడా బెల్ట్‌షాప్‌ల్లో దొరుకుంది. ఇటు పోలీసుశాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

బెల్ట్‌షాప్‌లకు ఎలాంటి అనుమతులు లేవు. అధిక ధరలకు మద్యం విక్రయించినా. వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మండలంలో బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశాం.
– జుల్ఫికర్ అహ్మద్, ఎక్సైజ్ సీఐ, ఇచ్చోడ

ఆర్టీఏ కార్యాలయం లేక అవస్థలు

- ఉట్నూర్‌లో ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



ఉట్నూర్‌లో వాహనాలు

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీలోని ఉట్నూర్‌లో (ఆర్టీఏ) రోడ్డు రవాణాశాఖ కార్యాలయం లేక లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్నెస్ తదితర పనుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైసెన్స్ తీసుకోవాలన్నా.. జిల్లా కేంద్రానికి రెండు, మూడుసార్లు వెళ్లాల్సి వస్తుంది. అధికారులు వాహనాలు తనిఖీలు చేసినప్పుడు అధికారులు విధించిన ఫైన్ కట్టేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఆర్టీఏ కార్యాలయం అందుబాటులో ఉంటే యువతకు ఇబ్బందులు తప్పనున్నాయి. పెద్ద వాహనాలకు ఫిట్‌నెస్‌ల కోసం సైతం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏజెన్సీ వ్యాప్తంగా జనాభా, వాహనాల రద్దీ పెరుగుతుండటంతో చిన్న పని అయినా 60 కి.మీల దూరంలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లాల్సిన పరిస్థితి. వాహన షోరూంలు ఉట్నూర్‌లో ఉన్నప్పటికీ ఏ చిన్న వాహనం కొనుగోలు చేసినా. ఆదిలాబాద్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అక్కడ సరైన సమయంలో పనులు కాక ప్రజలు, గిరిజనులు అనేక కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీఏ కార్యాలయ సేవలు అందుబాటులో తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఏర్పాటు చేయాలి



ఉట్నూర్ పట్టణ కేంద్రంలో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి. వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది. లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సేవలు అందుతాయి. ఇక్కడి ప్రాంతవాసులు లైసెన్స్ తదితర వాటి కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది.
– దావూద్, వాహదారుడు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



ఉట్నూర్‌లో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఇక్కడ వాహనదారులు, ప్రజలు, యజమానులు కార్యాలయం లేక నానా తంటాలు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఎమ్మెల్యే సహకారంతో కార్యాలయ ఏర్పాటు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా. – దూట రాజేశ్వర్, ఆర్టీఏ మెంబర్ ఆదిలాబాద్ జిల్లా

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



ఇచ్చోడ: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



తాంసిలో..



ఉట్నూర్‌రూరల్: నిరసన తెలుపుతున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో గుమ్మడి భీంరెడ్డి, కొల్లురి చంద్రశేఖర్, కదం బాబారావు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: బీహార్ సభలో ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు సరికాదని మండల బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బింగి వెంకటేశ్, కొండేరి రమేశ్, దావుల బాలాజీ, కందుకూరి రమేశ్, సాగర్, రాజేందర్ పాల్గొన్నారు.

బోథ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన మాతృమూర్తిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా బీజేపీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. వెంటనే క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు బోరె రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సాత్నాల: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు అస్తక్ సుభాష్ ఖండించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పోతురాజు రమేశ్, నర్సింగ్, నగేశ్, తిరుపతి, ప్రతాప్, నందు పాల్గొన్నారు.

జైనథ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంతరాష్ట్ర రహదారిపై మండల బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ చిత్రపటాలతో నిరసన తెలిపారు. మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికావన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ యాదవ్, రాందాస్, సామ రమేశ్ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, బిక్కీ సంతోష్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: ప్రధాని మోదీ తల్లిపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ.. దిగజారుడు రాజకీయాలు చేసే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో కేంద్రే శివాజీ, భరత్, రాజేంద్రప్రసాద్, మహేశ్, కుమార్ కేంద్రే, కిరణ్, అర్జున్ పాల్గొన్నారు.

తాంసి: రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ తాంసి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం నిరసర ర్యాలీ చేపట్టారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకిరణ్, సంతోశ్ రెడ్డి, సదానంద్, అరుణ్, శంకర్, లస్మన్న, నర్సారెడ్డి పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై వెళ్లేదెలా?



భోరజ్ మండలం ఆకోలి, కేదార్పూర్ వెళ్లే రోడ్డుమార్గంలో అడుగడుకో గుంత ఉంది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు మార్గం సరిగా లేదని ఇటీవల ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా రద్దు చేశారు. ప్రైవేటు వాహనాలు కూడా రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– సాత్నాల

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న కిరణ్, నాయకులు

భీంపూర్: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విఫలం చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని పిప్పలకోటి గ్రామంలో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. ఆశలకు కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలన్నారు. టార్గెట్ పేరిట పని భారాన్ని తగ్గించాలన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన ఆశ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, లక్ష్మన్న, ఇంద్రజ్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయక శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న కంది శ్రీనివాస్ రెడ్డి దంపతులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయప్ప ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయక నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 1 గంటలకు ప్రారంభమైన శోభాయాత్రను భజన, సంకీర్తనలతో నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ కుంటలో వినాయకుడి నిమజ్జనం చేశారు.

56 రకాల నైవేద్యాలు..

ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీ హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి కాలనీ మహిళలు ఆదివారం చెప్పన్ భోగ్ నైవేద్యాలు సమర్పించారు. ఉదయం వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తయారు చేసిన 56రకాల నైవేద్యాలను వినాయకుడికి సమర్పించారు.

వినాయకునికి ‘కంది’ పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కుమార్ పేట్ కాలనీలో కుమార్ జనతా గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ఆదివారం కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రాథోడ్ శ్రావణ్



రాథోడ్ శ్రావణ్

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్ నాంపల్లిలోని కమిషనర్ కాలేజీఎట్ విద్యాశాఖలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులకు పదోన్నతి ప్రక్రియ నిర్వహించారు. గుడిహత్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రాథోడ్ శ్రావణ్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్స్) ఆదిలాబాద్ యందు పదోన్నతి లభించిందని శ్రావణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న 22 మంది అధ్యాపకులు పదోన్నతి పొందారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల రాష్ట్ర అధ్యాపకుల సంఘం నాయకులు సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొమరారెడ్డి, బాబురావు పాల్గొనడం జరిగిందన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం రాత్రి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

దుమ్ము లేస్తోంది



దుమ్ము లేపుతున్న వాహనాలు

జైనథ్: బేల మండలం సరిహద్దు నుంచి భోరజ్ మండల కేంద్రం వరకు జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు దుమ్ము లేవడంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులకు రోడ్డు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా స్థానిక కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించి రోడ్డుపై దుమ్ము లేవకుండా నీటిని పోయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరువర్గాలపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదివేనగర్‌లో దాడులకు పాల్పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కాలనీకి చెందిన కాంబ్లే శ్యాంరావ్ శనివారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే కాలనీకి చెందిన సమీర్, జమ్ము రహదారిపై ఉన్నారు. దీంతో శ్యాంరావ్ హారన్ కొట్టడంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగింది. దీంతో షేక్ మోబీన్ అహ్మద్, కుర్షిద్ అహ్మద్, షేక్ సామీర్, జమ్ము, మరోవర్గం కాంబ్లే శ్యాంరావ్, నిమ్మల కార్తీక్, కాంబ్లే అజయ్, కాంబ్లే సొములు పరస్పరం దాడి చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు రెండు వర్గాలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

80 గంజాయి మొక్కలు స్వాధీనం

నేరడిగొండ: మండలంలోని గోవింద్‌పూర్‌లో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు విజేష్ రాథోడ్ పత్తిపంట లో తనిఖీ చేయడగా 23 గంజాయి మొక్కలు, రాజు యాదవ్ పంట పొలంలో 57 గంజాయి మొక్కలు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 80 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

శ్రమదానంతో గుంతలు పూడ్చివేత



గుంతలు పూడుస్తున్న యూత్ సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి నుంచి ఉట్నూర్ వెళ్లే మార్గంలో పులిమడుగు గ్రామం దగ్గర ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ప్రయాణికులు, వాహనదారులకు ప్రయాణం నరకంగా మారడంతో పులిమడుగు గ్రామయువ నాయకుడు బాబా చవాన్ ముందుకొచ్చారు. ఆదివారం శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. యువకులు సొంత డబ్బులతో సిమెంట్ ఇసుక కంకర తెప్పించి గుంతలు పడిన ప్రదేశంలో నింపి చదును చేశారు. కార్యక్రమంలో విశాల్ పవర్, చేతన్, ఆనంద్ ,విజయ్, రాకేశ్, అజయ్, యువరాజ్, అశ్విన్, అజయ్, కృష్ణ, సురేశ్, బాలకృష్ణ, సాయి, శివరాం పాల్గొన్నారు.

కాలువకు గండి.. పొలాల్లోకి వరద



గండిపడి బయటకు వెళ్తున్న వరద

సాత్నాల: సాత్నాల ప్రాజెక్ట్ ప్రధాన కాలువకు గండి పడటంతో, నీరు దిగువనున్న పంట పొలాల్లో వరద చేరి తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. వర్షాలతో పంట నష్టం ఒకవైపు జరుగుతుంటే, కాలువలకు గండిపడి పంటలు మరింత దెబ్బతింటున్నయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

శ్రామికవర్గాల పెన్నిధి అన్నాభావు సాఠే



జయంతిలో పాల్గొన్న సీఐ, నాయకులు

నార్నూర్: శ్రామికవర్గాల పెన్నిధి అన్నాభావు సాఠే అని సీఐ ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అన్నాభావు సాఠే చౌక్ వద్ద 105వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్‌తో కలిసి జెండా ఆవిష్కరించారు. తన రచనలతో సమాజంలో అవగాహన కల్పించేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. సమాజ చైతన్యం కోసం నిరంతరం శ్రమించారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బ్రిజ్జులాల్, రెడ్డి నాయక్, ఆడే సురేశ్, మాడవి మాన్కు, కైలాస్ నాయక్, మహేందర్ పాల్గొన్నారు.